తిరుపతి ధ్యానంలో మార్పులేదు! అది అవిశ్రాంతిగా  కొనసాగుతూనే వుంది.

అదే సమయంలో ఆ రాయిమీద కూర్చుని వున్న వ్యక్తి లేచి నిలబడ్డాడు. అతడి రూపం చూడటానికే భయంకరంగా వుంది. మనిషి ఆరడుగుల అయిదంగుళాల ఎత్తరి, బలిష్టుడు, పొడవాటి జుట్టు, గడ్డం, జనపనార గోచీతో వున్నాడతను.

అతని గుహంతా ఖాళీగా వుంది.

అక్కడక్కడా మనిషి పుర్రెలు, ఎముకలు కనిపిస్తున్నాయి. ఓ దగ్గర కొన్ని గోనెపట్టా ముక్కలు.

అతను ఒక్కసారి ఒళ్ళు విరుచుకుని ముందుకు రాసాగాడు. ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాడు.

మరో రెండడుగులు ముందుకొచ్చాడతను.

ఒక్కసారే ఏదో దుర్వాసన .....

మనోనేత్రం సమయం అయిపోయిందన్న సూచనగా మెల్లగా వెనక్కి మరలింది.

ముందుగా దుర్వాసన దూరమయింది.

తరువాత కనులముందుకు వచ్చినతని రూపం .....

తరువాత పుర్రెలు, ఎముకలు, గోనెపట్టా ముక్కలు, ఆఖరుగా గుహ ..... వృక్షాలు, పుష్పాలు, ధవళకాంతులీనుతూ మెరిసిపోతున్న ప్రకృతి ..... శరీరానికి కలుగుతున్న చల్లటి అనుభూతి దూరమవుతోంది.

ఒక్కసారిగా వేగం పెరిగింది. అన్నీ అలికేసినట్టు ..... గిర్రున తిరుగుతున్న గోళాకారంలా అయిపోతోంది ప్రకృతి ..... ఆ తరువాత వెలుగు తగ్గిపోసాగింది. క్రమంగా ఆ వెలుగు సూది మొనంత అయిపోయి చీకటి ..... అదీ చిక్కనవుతూ గాఢాంధకారం చుట్టుముట్టేసింది.

మరికొద్దిసేపటికి చిన్న కుదుపుతో అతని కళ్ళు అప్రయత్నంగా తెరుచుకున్నాయి!

మెల్లగా వెనుదిరిగి చూశాడు. మంచం మీదున్న మహదేవ్, దు:ఖసాగరంలో మునిగిపోయున్న అభిరాం, మనస్విని, వరప్రసాదం కనిపించారు. తిరుపతి లేచి నిలబడ్డాడు. మౌనంగా వాళ్ళని సమీపించాడు.

అతన్ని ముందుగా గమనించింది వరప్రసాదం.

“తిరుపతిగారూ! తెలిసిందా? మహదేవ్‌ని ఈ విపత్తునుంచి కాపాడగల మహనీయుడి ఆచూకీ తెలిసిందా?” ఉద్వేగంగా అడిగాడతను.

అభిరాం ఆత్రుతగా అతనివంక చూడసాగాడు.

తిరుపతి విపులంగా వాళ్ళకి ఒక్కొక్క విషయమూ చెప్పసాగాడు. అభిరాం, వరప్రసాదం ఆశ్చర్యంగా వింటున్నారు. తిరుపతి చెప్పడం ముగించగానే అతనెవరో అర్థమైపోయింది వరప్రసాదానికి.

"అతనెవరో నాకు తెలుసు" ఆనందంతో అతని మాట తడబడింది.

"ఎవరతను?" తిరుపతితోపాటు అభిరాం కూడా అడిగాడు.

"హిమాలయాలలో వుండే అఘోరీ అతను! అంటే ఇంకా బతికే వున్నాడన్నమాట."

'హిమాలయాలు కరెక్ట్ ..... తనకి కనిపించిన ధవళ కాంతుల ప్రకృతి హిమాలయ పర్వతాలదే ఆ దృశ్యం తన కంటికి కనిపించగానే తన శరీరమంతా చలికి వణకడం కూడా జరిగింది' అనుకున్నాడు తిరుపతి.

"నేను నీకు చెప్పిన అఘోరీయే ఇతను. ఇతనే మహదేవ్‌ని రక్షించగల మహిమాన్వితుడు" అభిరాం వంక చూస్తూ అన్నాడు వరప్రసాదం.

'పోయింది. ఉన్న ఒక్క ఆశా పోయింది. హిమాలయ పర్వతాలలో అతనికోసం ఎక్కడని వెదకడం? వ్యవధి కూడా లేదు ..... ' నిరాశగా అనుకున్నాడు అభిరాం.

మనస్విని పరిస్థితి అందుకు విరుద్ధంగా ఏంలేదు.

"మీరు హిమాలయాలకు వెళ్ళారా?" వరప్రసాదాన్ని అడిగాడు తిరుపతి.

"అవును! చాలాకాలమైంది."

"అదృష్టవంతులు."

'అవు'నన్నట్లు చిన్నగా తలపంకించాడు వరప్రసాదం.

* * * * *

అప్పుడు సమయం సరీగ్గా సాయంత్రం ఆరు గంటలయింది.

ఉన్నట్టుండి మహదేవ్‌కి వాంతులు ప్రారంభమయ్యాయి. 'ఓ ..... క్ ..... ఓక్' అంటూ అపస్మారక స్థితిలోనే వాంతి చేసుకోసాగాడు.

డాక్టర్‌కి అతని జబ్బేమిటో అర్థంకాలేదు. ఒకదాని తరువాత ఒకటిగా వస్తున్న రోగాలకి కారణమేమిటో ఎంత ఆలోచించినా అతనికి అంతు చిక్కటంలేదు. నర్స్‌కి ఏదో సైగచేశాడు. మరుక్షణం అతని శరీరంలోంచి సిరంజ్ ద్వారా బ్లడ్ తీసిందామె. లాబ్‌కి వెళ్ళి టెస్ట్ చేయించి రిపోర్ట్ తీసుకొచ్చింది.

ఆశ్చర్యం!

బ్లడ్ రిపోర్ట్ మహదేవ్ రెండు కిడ్నీలూ చెడిపోయాయని సూచిస్తోంది. అతని మూత్రపిండాలు వ్యర్థమైన విషపదార్థాలను వడగట్టకపోవడం వలన అవి రక్తంలో పేరుకుపోయాయ్. మరు నిమిషమే అతన్ని ఆపరేషన్ థియేటర్‌కి తరలించారు.

ఎనస్తీషియన్ ఇచ్చిన ఇంజక్షన్‌తో మహదేవ్ శరీరం అచేతనంగా అయిపోయింది. ఇద్దరు డాక్టర్లు మౌనంగా తమ పని చేసుకుపోతున్నారు. వాళ్ళకి సహాయంగా ఇంకో ఇద్దరు జూనియర్ డాక్టర్లు, ఇద్దరు నర్సులు వున్నారు.

ఆపరేషన్‌ని ప్రారంభిస్తూ ముందుగా అతని పొత్తికడుపు క్రింద భాగంలో మూత్రనాళిక(గొట్టం) ద్వారా ఒక ప్రత్యేక డయాలిసిస్ ద్రవం పెరిటోనియల్ కుహరంలోకి

పంపబడింది.

ఈ ద్రవంలో డెక్స్ట్రోస్ వుంటుంది. ద్రవాభిస్రుతి ప్రక్రియద్వారా రక్తంలోని వ్యర్థ పదార్థాలు, అదనపు ద్రవం పెరిటోనియం ద్వారా పెరిటోనియర్ కుహరంలోనే వున్న డయాలిసిస్ ద్రవం లోనికి లాగివేయబడుతుంది.

మూత్రం ద్వారా పోయే వ్యర్థపదార్థాలు డయాలిసిస్ ద్రవంలోకి చేరిపోతాయి. రోజుకి నాలుగుసార్లు వుపయోగించిన ద్రవాన్ని లాగివేసి- తరువాత కుహరాన్ని తాజా ద్రవంతో నింపాలి.

ఒక్కసారి మార్పిడి పూర్తవడానికి దాదాపు నలభై అయిదు నిమిషాల వరకూ పడుతుంది.

ఇది శరీరం లోపలే రక్తాన్ని శుభ్రంచేసే కొత్తరకమైన డయాలిసిస్ ప్రక్రియ. దీనినే 'పెరిటోనియల్ డయాలిసిస్' అంటారు. మరో మూత్రపిండం అమర్చే వరకూ ఇలా చేస్తుండాలి.

* * * * *

గంటన్నర గడిచిన తర్వాత శస్త్రచికిత్స పూర్తయి మహదేవ్ తన గదికి చేరుకోబడ్డాడు.

చీఫ్ గదిలోకి నడిచాడు డాక్టర్.

"గుడీవినింగ్!" విష్ చేశాడు అతను.

"గుడీవినింగ్! ఏమిటిలా వచ్చారు?" ప్రశ్నించాడు చీఫ్.

"మహదేవ్ జబ్బేమిటో ఇప్పటికే సస్పెన్స్‌గానే వుండిపోయింది. ఎప్పటికప్పుడు కొత్తరోగాలు వస్తున్నాయి. మీ అభిప్రాయం ఏమిటి?"

"నా అభిప్రాయం ఏమీలేదు" అన్నట్టు మౌనంగా వుండిపోయాడు అతను.

"ఎక్కడో ఏదో మెలికవుంది. ఎక్కడున్నదే తట్టడంలేదు. గుండెలోనా? మెదడులోనా? లివర్‌లోనా?" తనలో తానే అనుకుంటున్నట్లు పైకే అనేశాడు డాక్టరు.

దానికి కూడా మళ్ళీ మౌనమే చీఫ్ సమాధానమయ్యింది.

* * * * *

మహదేవ్ శరీరం మరింతగా శిథిలమయిపోయింది.

బాగా పెరిగిపోయిన గడ్డంతో, తోటకూరకాడల్లా వేల్లాడిపోయిన చేతులతో శుష్కించిపోయి నిశ్చలంగా వున్నాడు. గబుక్కున ఎవరైనా చూస్తే అతను మరణించాడేమో అనుకుంటారు.

నెమ్మదిగా శ్వాస తీస్తున్న శబ్దం ఒక్కటే అతని వునికిని తెలియజేస్తోంది.

అభిరాం భావరహితంగా మహదేవ్‌నే చూస్తున్నాడు.

మనస్విని పూర్తిగా మాట్లాడ్డం మానేసింది. ఆమె చూపులెప్పుడూ శూన్యంలో దేనినో వెదుకుతూనే వుంటున్నాయ్. తిరుపతి ఎడతెగని ఆలోచనలతో కొట్టుమిట్టాడుతున్నాడు.

అప్పుడే ఓ విషయం గుర్తుకొచ్చింది.

"అభిరాంగారూ! వరప్రసాదంగారు ఏమైపోయారు? ఆయన కనపడకుండా పోవడం ఈరోజుకి నాలుగోరోజు కదూ?" అన్నాడు.

"నిజమే! మహదేవ్ విషయంలో పడి ఆ సంగతే గమనించలేదు. అతనేమైపోయినట్లు?" అనుకున్నాడు అభిరాం.

అదే సమయంలో దేశానికి ఉత్తరం వైపునున్న ఎత్తయిన సరిహద్దు ప్రాంతంలో వున్నాడు వరప్రసాదం.

సముద్రమట్టం నుంచి దాదాపు 19000 అడుగుల ఎత్తున్న నుంచుని రారమ్మని ఆహ్వానిస్తున్నట్లు కనిపించాయ్ హిమగిరి శిఖరాలు.

హైద్రాబాద్ నుంచి ఆ ప్రదేశానికి కేవలం నాలుగురోజుల్లో అతను చేరుకున్నాడంటే దానిక్కారణం అతని మనస్సులో బలంగా నాటుకుపోయిన ఒకే ఒక్క తీవ్రమైన సంకల్పం. అది ..... అఘోరీ బాబాని కలుసుకుని మహదేవ్‌ని ఎలాగయినా రక్షించమని కోరటం. ఆ సంకల్పబలమే అతన్ని ఏ ఆటంకాలూ లేకుండా తీసుకొచ్చిందేమో!

"ఇప్పుడు సరిహద్దు దాటి ముందుకు సాగాలి" అనుకున్నాడు వరప్రసాదం.

అది యాత్రికులు హిమాలయాలను, మానవ సరోవరాన్ని తిలకించడానికి వచ్చే సమయంకాదు. మనదేశం ప్రతియేటా జూన్ 5 నుంచి సెప్టెంబర్ 1 వరకూ పధ్నాలుగు బ్యాచ్‌లను మానస సరోవర యాత్రకు పంపుతుంది. 1962 వరకూ ఆ ప్రదేశం భూభాగంలోనే వుండేది.

ఆ తరువాత చైనా మనదేశంపై దురాక్రమణ చేసి ఆ ప్రదేశాన్ని ఆధీనం చేసుకున్నప్పటినుంచీ, దాదాపు ఇరవై సంవత్సరాలపాటు కైలాస మానస సరోవరాన్ని సందర్శించే భాగ్యాన్ని మనవారు కోల్పోయారు. 1977-80ల మధ్య జనతా ప్రభుత్వ హయాంలో అటల్ బిహారీ వాజ్‌పేయ్ విదేశీ వ్యవహారాలశాఖ మంత్రిగా చైనా పర్యటనకు వెళ్ళినప్పుడు ఈ సమస్య పరిష్కారమయింది.

కైలాస మానవ సరోవరం భారతీయులకి ఆధ్యాత్మిక క్షేత్రమని, ఈ విషయంపై మరొకసారి పునరాలోచించుకుని ఆ భాగ్యాన్ని భారతీయులకి కలిగించమని చైనా ప్రభుత్వాన్ని ఆయన ఒప్పించారు. ఫలితంగా 1981-82 నుంచి మళ్ళీ భారతీయులకు ఈ ఆధ్యాత్మిక క్షేత్రాన్ని సందర్శించే భాగ్యం కలిగింది.

యాత్రికులు ఢిల్లీనుంచి అంచెలంచెలుగా ఈ పుణ్య క్షేత్రం చేరుకుంటారు.

ఢిల్లీలో వున్న విదేశీ వ్యవహారాల శాఖ కార్యాలయంనుంచి యాత్రికుల వెంట ప్రభుత్వ ప్రతినిధిగా వచ్చే లయజన్ ఆఫీసర్ వుంటాడు.

ఆ తరువాత ఐ.టి.బి.పి. ఆసుపత్రిలో యాత్రికుల ఆరోగ్యాన్ని పరీక్షిస్తారు. యాత్రలో ఎదురయ్యే భిన్నమైన వాతావరణానికి వారు తట్టుకోగలరో లేదో నిర్ధారించే ఫిట్‌నెస్

సర్టిఫికెట్లు ఇస్తారు. అప్పుడు యాత్ర ప్రారంభం అవుతుంది.

మన ప్రభుత్వం, కుమావున్ మండల్ వికాస్ నిగమ్ (కె.ఎం.వి. ఎన్) వారు సంయుక్తంగా యాత్రికులని దేశ సరిహద్దు దాటిస్తారు. యాత్రకు అనుమతి లభించగానే కె.ఎం.వి.ఎన్. పేర వెయ్యిరూపాయలు డి.డి. తీసి విదేశీ వ్యవహారాల శాఖ వారికి పంపాలి.

అనంతరం ఇండియా వైపు భోజనం, వసతి, లగేజీ చార్జీలు గైడ్ చార్జీలు నిమిత్తం మరో ఆరువేల ఐదువందల రూపాయలు చెల్లించాలి. చైనావైపు ఆ ప్రభుత్వం చేసే ఏర్పాట్లు కోసం వారికి 500 అమెరికా డాలర్లు చెల్లించాలి. చైనాలో యాత్రికులకి ఖర్చులకోసం ఇండియాలో 150 డాలర్లు ఇస్తారు. ఇందుకోసం ఒక్కో యాత్రికుడు 22 వేల రూపాయలు చెల్లించాల్సి వుంటుంది.

ఇంత తతంగమూ, ఏ అడ్డంకులూ లేని సమయంలో వరప్రసాదం స్వేచ్ఛా విహంగంలా హిమాలయ పర్వత ప్రాంతాల్ని సందర్శించాడు.

ఇప్పుడన్నీ అడ్డంకులే! పాస్‌పోర్ట్‌లేదు. ఓ గైడ్ లేడు. వాహన సదుపాయం లేదు. ముఖ్యమైన శరీరదారుఢ్యం కూడా లేదు ..... వున్నదల్లా ఒక్కటే ..... పట్టుదల, మహదేవ్‌ని బతికించుకోవాలనే తీవ్రమైన వాంఛ. అదే అతన్ని అన్నిటికీ తెగించేలా చేసింది. మనసులో మరోసారి అఘోరీ బాబాని తలుచుకున్నాడు. నేరుగా నడుస్తున్నాడు!

చల్లటి ఈదురుగాలులు ఎన్ని ముతక దుస్తులు ధరించినా, ఎన్ని స్వెట్టర్లు శరీరాన్ని కప్పి వుంచినా గజగజ వణికిస్తున్నాయ్.

అతను మంచుకొండల్లో నడుస్తున్నా కళ్ళుమాత్రం నలువైపులా శోధిస్తూనే వున్నాయ్. ఎవరైనా తన మార్గానికి అడ్డువస్తారని.

అయితే ఒక మంచి కార్యాన్ని చేస్తున్న అతన్ని ఆపడానికి ఇచ్చగించని దైవం సరిహద్దు గస్తీ దళాలకి వరప్రసాదం వునికి తెలియనివ్వలేదన్నట్టు దారిలో ఒక్కరూ కనిపించలేదు.

కనిపించిన ఒకటి రెండు చెక్‌పోస్ట్‌ల వద్ద కూడా అప్పటిదాకా వుండి వెళ్ళిపోయినట్లు సైనికుల బూట్ల ముద్రలు అతను గమనించగలిగాడు. అతని మనసెందుకో అనిర్వచనీయమైన ఆనందానికి లోనవుతూనే వుంది. ఆ ప్రదేశాన్ని చేరుకున్నప్పట్నుంచి.

ముందుగా అతను చేరుకున్న ప్రదేశం 'కైసాని' తరువాత వరుసగా 'త్రిశూల్' పర్వతాలు, 'దుర్చులా' (ఈ ప్రదేశం కాశీ నది ఒడ్డున వుంది. నదిపై వంతెనను దాటితే అవతలివేపు నేపాల్! అక్కడికి ఏ ఆంక్షలూ లేకుండా వెళ్ళొచ్చు.)

వరప్రసాదం నడుస్తూనే వున్నాడు. 'ఇక విశ్రాంతి తీసుకో!' అన్నట్లు ఆ పర్వత పంక్తులన్నీ వెలుగుకి వీడ్కోలు చెప్పి, చీకటిని ఆహ్వానించాయ్. అతను కనిపించిన ఓ గుహవైపు నడిచాడు.

*     *     *     *     *